# ఆగస్ట్ 15

## స్వామిచిలిత్రానంద

ఆగస్ట్ పదిహేను నేడే.
భారతజాతి దాస్యశృంఖాల నించి ముక్తి పొందిన రోజు నేడే. భారత జాతి స్వతంత్ర జాతిగా నిలచి, తన జాతీయ పతాకాన్ని గగన సీమల్లో ఎగుర వేసుకుంటున్న రోజు నేడే.

తెలుగువాడి రాజధాని భాగ్యనగర్‌లో ఈరోజు-
రాజ్‌భవన్‌కు ఎదురుగా, రైలు పట్టాలకు అవతల, హుసేన్‌సాగర్‌కు ఇవతలా-
మురికి నీళ్ళవారగా వున్న గుడిసెల్లో- ఒకానొక గుడిసెలో-

"అమ్మా! ఎల్తాస్తా. ఇయాల జెండాల బిజినెస్ - అదిరిపోద్ది - ముప్పై కొన్నాను -పది రూపాయలెట్టి- ఒకోటి రూపాయికి అమ్మినా, ముప్పై వత్తాయి- పెట్టుబడిపోను-ఇరవై మిగుల్తాయి-ఇయాల నీకు ఇందుబోజనమే ఫో."

"ఇందులెందుగ్గాని-దగ్గుమాత్తర్లట్టుకురా-ఓ రూపాయికి-"

"దగ్గు గిగ్గు జాంతానై-డాక్టర్‌కే పాస్ జాతాహై-పైసాదేతాహై-ఓ ఆతాహై-ని రోగం జాతా హై.. హం ఆతా హై-"అంటూ పరుగుపరుగున పరు గెత్తాడు పది పన్నెండేళ్ళ మారిగాడు.

అతన్ని చూసిన అమ్మలక్కలు-
"ఏరా మారిగా!రోజుకోటి అమ్ముతుంటా వెందుకురా!రోజు ఒకే దినుసు అమ్మ కోరాదు?"
"నై...నై...హమ్ ఐసానైకర్తే..."అంటూ పరిగెత్తాడు
పబ్లిక్ గార్డెన్స్ సిగ్నల్స్ దగ్గర ఆగాడు
సిగ్నల్స్ దగ్గర ఆగే కారు దగ్గరకు వెళ్ళాడు.
"సాబ్! ఏ జండా ఆప్‌కా గాడీకు లగ్వాదీజియే- అచ్ఛా లగ్తాహై," అంటూ బతిమాలాడు.

"పోరా, నీ జెండా నువ్వూను-మాకొద్దు- ఎవడి జెండా, తగిలిస్తే, ఎడిక్కోపం ఒస్తుందో- ఒద్దు- జెండా లేపోతే అంతా తనోడే అనుకుంటారు" అంటూ వెళ్ళిపోయాడు.
కాస్సేపయాక-
'సార్! చాలాసేపైందండి- ఒక్క జెండా కొనండి సార్- ఖద్దరు కట్టుకున్నారుగా?- ఒక్కటి సార్- మీరు దేశ భక్తులుగా సార్-?"

"నాదేశం- నాభక్తి- గాంధీమహాత్ముడితోనే పోయింది. గత అరవై ఏళ్లనించి కట్టుకుంటున్న ఈ ఖద్దరును వదల్లేక, కట్టుకోలేక, ఛస్తున్నాను. దేశం నాశనమై పోయింది- దేశభక్తి నశించి పోయింది-".

సిగ్నల్ రంగు మారింది.
పాతకారు వెళ్ళిపోయింది.
సిగ్నల్ రంగు మారింది.

"సార్! దయచేసి కొనండి సార్! ఒక్కటి ఒకే ఒక జెండా సార్- మా అమ్మకి జబ్బుగా వుంది సార్- ముసల్దిసార్. అన్నం తినలేదు సార్- లేవలేదు సార్- కూచోలేదు సార్-"

"ఎవరుభే" అంటూ కారులోనిద్రపోతున్న ఓ పెద్ద శాల్తీ సీటులోంచి లేచి-
"మీ అమ్మ ముసల్దా? వయసెంతా బాబూ?"
అదేం నాకు తెలవదు.. ఎనభై ఉంటుంది".
"ఇదండీ మనదేశంలో ఫామిలీ ప్లానింగ్- ప్లానింగ్-ఎనభై ఏళ్ల దానికి, పదేళ్ల కొడుకు, నేనీ దేశాన్ని బాగు చేయలేను. మీ అమ్మకి ఎనభై ఏళ్లు- నీకు పదేళ్ళు- మీ అమ్మకి ఎందరు మొగుళ్లు? పోనీ నీకెందరు నాన్నలు?"

"నోర్ముయ్యరా నాకొడకా!" అంటూ మారిగాడు చేతులు లోపలకు చాచి, ఆ భారీ విగ్రహాన్ని పట్టుకున్నాడు. మా అమ్మంటే ఏమనుకున్నావురా? మా నాయనమ్మ- నన్ను పెంచిన అమ్మ. అదేరా నాకు అమ్మ-నాన్న, అదే నాకు అన్న తమ్ముడు, అక్క,చెల్లాయ్: ఇంకే మన్నా వాగేవో!" అంటూ చెయ్యి ఎత్తాడు.

"శాంతి...శాంతి..." అంటున్నట్టు పచ్చ లైటు వెలిగింది.
ఆ నల్ల కారు పారిపోయింది. భారీ విగ్రహం బతికి పోయాడు.
లైట్లు రంగులు మారుతున్నాయి.
రంగురంగుల కార్లు పోతున్నాయి.
ఎవరూ ఒక్క జెండా కూడా కొనడం లేదు.
సాయంత్రమైంది.
మారిగాడికి తిండి లేదు. నాయనమ్మకే తిండి లేదు. ఒక్క జెండా అయినా అమ్ముడయితే కదా?
"సార్! మీరు మంచివారు సార్. కొనండి సార్. మా అమ్మకి మందులు సార్. మా అమ్మ చాలా ముసల్ది సార్. పొద్దునించి ఏం తినలేదు సార్ నేను. మానాయనమ్మ కూడా ఏం తిన





లేదు సార్-'' అంటూ బతిమాలాడు.

ఆ ఫొటోగ్రాఫర్‌కి ఏదో ఆలోచన వచ్చింది. వెంటనే ఫోటో తీశాడు. మారిగాడు అతని చేతిలో జెండాలు. ''అమ్మకోసం - దేశం కోసం' బలే టైటిలు - భలే సబ్జెక్ట్. నూరు రూపాయలు వస్తాయి అంటు స్కూటర్ స్టార్ట్ చేశాడు.

సార్''సార్! మరి, నాజెండా కొనరూ?''

''పోరా, నీ జెండా ఎవడిక్కావాలి. ముఖ్య మంత్రి గారు జెండా ఎగరేసారు ఆయన్ని ఫోటో తీయాలి.'' అంటూ వెళ్లిపోయాడు.

మారిగాడి మనసులో ఆలోచన మెదిలింది.

జెండా ఎగరేసే మీటింగుకి జెండా మీద భక్తి వున్న వాళ్లంతా వస్తారు. వున్న జెండాలన్నీ అమ్ముడైపోతాయి. అమ్మకి సూది మందిప్పించ వచ్చునుకున్నాడు. మీటింగు దగ్గరకు వెళ్లాడు. ముఖ ద్వారం దగ్గర నిలబడి ఆత్రతగా అడుగుతున్నాడు. 'సార్' ఏక్ జెండా ఏక్ రూపియమే లేజీయే సాబ్ - లేజీయే-పచ్చాస్ పైసాయే లేత్ సాబ్ జెరామె హర్బా కర్నసాబ్''

అంతా మంత్రిగారు ఎగరేసే జెండా దగ్గరకు వెళ్ళేవారేగాని, మారిగాడి చేతిలో వున్న జెండా కొనడం లేదు.

మంత్రిగారు జెండా ఎగరేశారు.

జాతీయ గీతం బ్యాండు మీద, టేపు రికార్డరు లోంచి వినవస్తోంది.

''భాగో...భాగో...లారీ జారై'' అంటూ పరుగెత్తారు-తాము వచ్చిన లారీలో ఎక్కి యింటికి వెళ్లడానికి.

పోలీసులు జనాన్ని వెనక్కి నెట్టుతున్నారు.

''సాబ్! ఏక్ జండా. ఏక్ రూపాయ్‌కా జెండా, పచ్చాస్ పైసామే లేవ్''

జనం వినడం లేదు. మారిగాడు బతిమాల్తున్నాడు. మారిగాడ్ని తోశారు. పడేశారు. తొక్కారు-తొక్కుతున్నారు. మారిగాడు అడుగుతునే వున్నాడు. కాని జెండా మాత్రం ఎవరూ కొనడం లేదు. మారిగాడు అడుగుతునే వున్నాడు. కాని జెండా మాత్రం ఎవరూ కొనడం లేదు. మారిగాడి చేతిలో వున్న ముప్పై జెండాల్లో ఒక్కదాన్ని కూడా వదల్లం లేదు.

'అమ్మా! అమ్మా!' అని అరుస్తున్నాడు.

'మారిడు! మారిడు!'' అని ఎక్కడినించో వినవస్తున్నట్లుంది మారిగాడికి.

'జెండా వుంఛా రహే హమారా' ఒక వైపునించీ 'జనగనమన' మరో వైపు నుంచీ చాలా గట్టిగా వినవస్తున్నాయి. గాలిలో ఆనందం.

నేలమీద పడి వున్న మారిగాడి పెదవులు 'అమ్మా! అమ్మా!' అనడం కోసం ప్రయత్నించి మానేశాయి. మారిగాడి రెండు చేతుల్లోనూ ముప్పై జెండాలో స్తంభించి వున్నాయి అతని గుప్పెట్లో- మంత్రిగారు ఎగ రేసిన జెండా గగన వీధిలో ఎగురుత ఒది- (కవుల మాటల్లో ఆనందంగా, హాయిగా, గర్వంగా, నిశ్చలంగా, నిశ్చలంగా).

'నేడే స్వతంత్ర దినం- వీరుల త్యాగఫలం' అనే పాట వినవస్తోంది లీలగా.

*